క్లుప్తంగా

సబ్‌జైల్‌లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు చూస్తున్న జడ్జి కరణ్‌కుమార్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌జైల్‌ను సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కరణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైల్‌లోని బాత్‌రూమ్‌లు, వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. అనంతరం ఖైదీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారిని పరామర్శించడానికి వచ్చిన బంధువులతో మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మార్పు చెందేందుకే జైలు అని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా యువనేస్తం



మాట్లాడుతున్న మునిశేఖర్

శ్రీకాళహస్తి: గిరిజనులకు అండగా యువనేస్తం అసోసియేషన్ ఉంటుందని అధ్యక్షుడు మునిశేఖర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం రామలింగాపురం ఎస్టీకాలనీ, భైరవ ఎస్టీకాలనీలో సోమవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో కొంతమందికి ఇప్పటికీ ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు, ఓటరు కార్డులు లేవన్నారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆధార్, రేషన్‌కార్డు లేకపోతే పేదవారికి ప్రభుత్వ పథకాలు అందవన్నారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వినోద్, మునెమ్మ, నాగమణి, వలంటీర్లు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని, రోజుకు 5 వేల మంది పనిచేసేలా చూడాలని ఎంపీడీఓ నరసింహారావు అన్నారు. సోమవారం ఉపాధి హామీ ఏపీఓ భానుప్రియ, సిబ్బందితో ఉపాధి పనులపై సమీక్షించారు. కూలీలకు స్థానికంగానే పనులు కల్పించాలని సూచించారు. సకాలంలో నగదు అందజేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటల పెంపకం వైపు మొగ్గు చూపేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏఓ త్రివిక్రమ్ రావు, ఈసీ మధుసూదనరావు పాల్గొన్నారు.

నేడు అత్తూరులో గడప గడపకు..

రేణిగుంట: మండలంలోని అత్తూరు సచివాలయ పరిధిలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన అత్తూరు పంచాయతీ పరిధిలోని అత్తూరు, ఏటీ వడ్డెన ఇండ్లు, అత్తూరు దళితవాడ, అరుంధతీవాడ, అమ్మవారి పట్టెడ, ఎస్టీ కాలనీ, చెర్లో ఇళ్ల గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు.

నాగాలమ్మకు ప్రత్యేక పూజలు



నాగాలమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పిచ్చాటూరు రోడ్డులో వెలసిన నాగాలమ్మ అమ్మవారికి నాగపంచమిని పురస్కరించుకుని భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ ఆలయానికి సమీపంలో మద్యం షాపు ఉండడంతో ఆలయానికి వచ్చే మహిళలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని మరోచోటుకు మార్చాలని కోరారు.

24న మండల మీట్

నారాయణవనం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. ఎంపీపీ దివాకర్ రెడ్డి అధ్యక్షన జరిగే సమావేశానికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రత్యేక అతిథిగా హాజరవుతారని చెప్పారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ప్రతి గడపలో సంక్షేమ ఆనందం





గాజులమండ్యంలో లబ్ధిదారురాలికి సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: పేదల ముఖాల్లో చిరునవ్వులు చూసినప్పుడే అభివృద్ధికి నిజమైన కొలమానమని నమ్మి నవరత్నాల పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపలో ఆనంద సిరులను కురిపిస్తున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ ఐటీబీ కాలనీ, ఏపీఐఐసీ క్వార్టర్స్, దేశమ్మ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. నవరత్నాల పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రతి ఇంటా ఆయనను సాదరంగా ఆహ్వానించి జగనన్న పాలనలో పథకాలు నేరుగా తమ ఇంటి వద్దకే చేరుతున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమ ప్రదాత సీఎం జగనన్నకు వచ్చే ఎన్నికల్లో తోడుగా నిలిచి మరోసారి గెలిపించుకుంటామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి మాటిచ్చారు. ఎవరైనా అర్హులై ఉండి సాంకేతిక కారణాల చేత పథకాల లబ్ధి అందకుంటే వారి ఫిర్యాదులను ప్రత్యేకంగా స్వీకరించి 'ప్రజాదర్బారు' కార్యక్రమం ద్వారా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

వైకుంఠ రథం ప్రారంభం..

పీఓపీఎల్ నిధులు, మరి కొంత సర్పంచ్ గంగారి రమేష్ తన వ్యక్తిగత నిధులు కలిపి మొత్తం రూ.9 లక్షలు విలువ చేసే వైకుంఠ రథాన్ని గ్రామంలో జరిగే అంతిమయాత్రకు వినియోగించేందుకు ఎమ్మెల్యే బియ్యపు మధు చేతుల మీదుగా ప్రారంభించారు.

ఎమ్మెల్యేను కలసిన సినీనటుడు గౌతంరాజు..

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గాజులమండ్యం పంచాయతీ దేశమ్మ నగర్‌లో పర్యటిస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సినీ నటుడు గౌతమ్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన



పుష్పగుచ్ఛం అందిస్తున్న సినీనటుడు గౌతంరాజు

ఎమ్మెల్యేకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సంధ్యారాణి, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీలు వెంకటరమణారెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి, జువ్వల దయాకర్ రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, విజయకుమార్, జగదీష్, సుందరవేలు, భరత్‌కుమార్, మహేష్, మన్యం శ్రీనివాసులురెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచులు నగేశం, మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి సమావేశం

నాగలాపురం: నాగలాపురం మార్కెట్ యార్డు ఆవరణలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

26న మంత్రుల రాక

ఈ నెల 26న నాగలాపురంలో రూ.2 కోట్లతో నిర్మించిన నూతన ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభోత్సవం జరగనుంది. డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, జిల్లా వైద్యాధికారి శ్రీహరి హాజరుకానున్నారు.

కోర్టు పరిధిలోని భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు



తహసీల్దార్ భార్గవికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: కుక్కంబాకం రెవెన్యూలో కోర్టు పరిధిలోని భూమిలోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ భార్గవి తెలిపారు. సోమవారం సర్వే నంబర్ 81లోని 39 ఎకరాల 76 సెంట్ల భూమిలో చెట్లను తొలగిస్తున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ భూమికి సంబంధించి 30 ఏళ్లుగా కోర్టులో కేసు పెండింగ్ ఉందని తెలిపారు. అందులో ప్రవేశించి జేసీబీ యంత్రాలతో చెట్లు, పుట్టలను తొలగించటం చట్టరీత్యా నేరమన్నారు. కేసు క్లియర్ అయ్యే వరకు భూమిలో ప్రవేశించకూడదన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కరణ్‌కుమార్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. పిల్లలు, మహిళల అక్రమ రవాణా జరుగుతోందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సందేహంగా ఉంటే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో కానీ అధ్యాపకులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల



విద్యార్థితో మాట్లాడుతున్న న్యాయమూర్తి కరణ్‌కుమార్

ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని చిన్నసింగమాలలో ఉన్న వీరభద్రస్వామి వారికి సోమవారం నాగపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పూలతో స్వామివారిని అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

ఏర్పేడు: ప్రభుత్వ విద్యాసంస్థలే ప్రగతికి మూలస్తంభాలని మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం అన్నారు. సోమవారం మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 78 మంది విద్యార్థులకు తమ సొంత ఖర్చుతో ఆయన యూనిఫాం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందారని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో బోధన ఉంటుందని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుంటే అన్నిరంగాల్లో రాణించవచ్చన్నారు. పేద విద్యార్థులకు తమవంతు సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. దాతలు



యూనిఫాం అందజేస్తున్న దాత సుబ్రమణ్యం

ముందుకు వచ్చి విద్యార్థుల అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఉమ, అధ్యాపకులు శ్రీమన్నారాయణ, వెంకటసుబ్బమ్మ, రామాంజులు, రాఘవరెడ్డి, శంకరప్ప, షమీర్, సురేష్, అమరేశ్వర్‌రెడ్డి, సువర్ణ, సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన కార్యవర్గంతో కూడిన సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు చైర్మన్ జ్ఞానాంబవారి మధు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గురుపూజోత్సవం






ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి, ఎమ్మెల్యే ఆదిమూలంకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

నారాయణవనం: మండల కేంద్రం నారాయణవనంలో సొరకాయల స్వామి 121వ గురుపూజోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 1008 కలశ జలాలతో మూలవిగ్రహానికి అభిషేకం చేవారు. ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం రిత్వికులు 1008 కలశాలను స్థాపించి హోమాది పూజలు చేశారు. ఉభయదారులతో సంకల్పం చేయించి కలశ జలంతో అభిషేకం చేయించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. రాత్రి పల్లకిని అధిరోహించిన సొరకాయలస్వామి పురవీధుల్లో విహరించారు. మహిళలు హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

చురుగ్గా కాలువ అభివృద్ధి పనులు





పూడిక తీసిన కీళగరం చెరువు కాలువ, ఆక్రమణలను తొలగిస్తున్న హిటాచీ

నారాయణవనం: అరుణానది నుంచి కీళగరం చెరువుకు నీరు చేరే ఫీడింగ్ చానల్ అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు 3.5 కిలోమీటర్ల మేర చెరువు ఆయకట్టు రైతుల సహకారంతో కాలువ ఆక్రమణలను తొలగించి, పూడిక తీస్తున్నట్లు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు సుదర్శనరెడ్డి తెలిపారు. చెరువు పూర్తి స్థాయిలో నిండితే రెండు పంటలకు నీరు అందడంతో పాటు భూగర్భ జల మట్టం పెరుగుతుంది. తిరువట్యం ప్రాజెక్ట్ దిగువన అరుణానదిలో చెక్‌డ్యాం నుంచి వీకే పాళ్యం, కీళగరం గ్రామాల మీదుగా కాలువలో నీరు కీలగరం చెరువుకు, అటు నుంచి వెత్తలతడుకు చెరువులకు చేరుతుంది. పలువురు కాలువను ఆక్రమించుకోవడం, మొక్కలు తొలగించకపోవడంతో కీళగరం చెరువుకు నీరు పూర్తిస్థాయిలో చేరడం లేదు. ఆయకట్టు రైతుల వినతి మేరకు కాలువను రూ 4.5 లక్షల అంచనా వ్యయంతో ఆక్రమణలను తొలగించి, కాలువలో పూడికతీత పనులు చేస్తున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న పాలనలో పేదలకు ఆర్థిక భరోసా



మహిళలకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం కొల్లడం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీల్లో పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందడంతో ఆర్థికంగా వారి పరిస్థితి మెరుగుపడిందన్నారు. పంచాయతీలో పరిధిలో 856 మందికి వివిధ పథకాల ద్వారా రూ. 3.41 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కొల్లడం గిరిజన కాలనీలో వసతులు కల్పించాలని మండల అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలకు విద్యుత్ వైర్లు అడ్డంకిగా ఉండడంతో నిర్మాణ పనులు కుంటుపడిందని తెలిపారు. కాలనీలో విద్యుత్ సౌకర్యాన్ని మెరుగు పరచాలన్నారు. అనంతరం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎమ్మెల్యే కోనేటి ఆదమూలం, సీడీపీఓ దేవకుమారితో కలిసి గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ షేక్ జరీనా బేగం, ఎంఈఓ రవి, శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్, పార్టీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏఎంసీ బాలాజీ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శెల్వి, రమణ, సురేంద్ర రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, గోవిందస్వామి, సర్పంచ్‌లు శేఖర్, రూబెన్, శ్రీనివాసులురెడ్డి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీసర్వే

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో త్వరలో చేపట్టనున్న భూముల రీ సర్వే కోసం రికార్డులను పక్కాగా సిద్ధం చేయాలని తహసీల్దార్ భార్గవి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో వీఆర్ఓలు, సచివాలయాల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే రైతులకు ఓ వరమని తెలిపారు. రైతులందరూ రీసర్వేకు సహకరించాలని కోరారు. భూముల రీ-సర్వేలో అన్ రిజిస్టర్, వంశపారంపర్య భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని



మాట్లాడుతున్న తహసీల్దార్ భార్గవి

తెలిపారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీటీలు చంద్రబాబునాయుడు, శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయభావం కలిగి ఉండాలి

సత్యవేడు: దేశంలోని ప్రతి పౌరుడు జాతీయ భావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నామట్టి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. అమరవీరులకు వందనం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఔనత్యాన్ని చాటి చెప్పాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలన్నారు. కాలుష్య నివారణకు కృషి చేయాలన్నారు. పాడిపంటలు వృద్ధి చెందాలంటే చెట్లను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏడు మండలాల్లో సేకరించిన మట్టిని ఒకే పాత్రలో



సేకరించిన మట్టిని అధికారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

వేసి దేశమాతకు నివాళులర్పించారు. అనంతరం మట్టి సేకరించిన పాత్రను ఏపీడీలు సరిత(పుత్తూరు), పేమ్‌కుమార్(శ్రీకాళహస్తి), ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓలు భాస్కరయ్య, కృష్ణయ్య, సుకన్య, నాగభూషణం, బాణుప్రియ, సుశీల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గెరిగె ఊరేగింపు



గంగమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్తున్న గెరిగె

రేణిగుంట: మండలకేంద్రం రేణిగుంట గంగమ్మ జాతర సంబరాలు ఊపందుకున్నాయి. సోమవారం అమ్మవారి ప్రతిరూపమైన గెరిగె ఊరేగింపుతో ఉత్సవ శోభ మొదలైంది. ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి గెరిగెను విశేషంగా పూలతో అలంకరించి పంబజోళ్లు, డప్పువాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో సోమవారం ఊరేగించారు. అమ్మవారే తమ ఇంటి ముందుకు వచ్చిందని భావించి భక్తులు గెరిగెకు కర్పూర హారతులు పట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో నేడు..

ఉదయం అమ్మవారికి తెల్లవారుజామున విశేష అభిషేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్దఎత్తున పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలో అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుంది. బుధవారం రేణిగుంట నడివీధి గంగమ్మ వద్ద వేప పందిరి వేసి పసుపుతో గంగమ్మ ప్రతిమను తయారు చేసి ప్రతిష్ఠించి అంబలి పోస్తారు. సాయంత్రం భక్తులు నేతిదీపాలు వెలిగించి, వేపాకు చుట్టిన కుండల్లో నైవేద్యం తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి దర్శించుకుంటారు.

జూనియర్ కళాశాలకు నూతన శోభ



వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం



నూతనంగా నిర్మించిన ప్రహరీగోడ

- నాడు-నేడుతో మారుతున్న రూపురేఖలు
- రూ. 61లక్షలతో పలు అభివృద్ధి పనులు

వరదయ్యపాళెం: నాడు-నేడుతో వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపురేఖలు మారుతున్నాయి. విద్యకు ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా రూ.61 లక్షలతో పలు అభివృద్ధి చేస్తోంది. ఇందిరానగర్ ప్రాంతంలో పదేళ్ల క్రితం నూతన భవనంలో ఏర్పాటైన కళాశాలకు భద్రత కరువైంది. అంతేకాక కళాశాలకు కేటాయించిన భూమి సైతం అన్యాక్రాంతం అయింది. ఈ క్రమంలో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు సమస్యను విన్నవించడంతో స్పందించిన ఎమ్మెల్యే కళాశాల అభివృద్ధి గురించి ప్రభుత్వానికి నివేదించారు. నాడు-నేడు పథకం ద్వారా రూ. 61లక్షలు నిధులు మంజూరు చేయించారు. తద్వారా కళాశాలకు నాలుగు వైపులా 500 మీటర్ల దూరం ప్రహరీగోడను నిర్మించారు. అంతేకాక కళాశాలకు వెళ్లే మార్గంలో అనుసంధానం రోడ్డు, గరల్స్ చేంజింగ్ రూమ్, తాగునీటి నిల్వలకు సంపు వంటి పనులను చేపట్టారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 150 మంది విద్యార్థులు చదువుతున్న కళాశాలలో అన్నిరకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడు-నేడుతో కళాశాల అభివృద్ధి



నాడు-నేడు కార్యక్రమం ద్వారా కళాశాలకు రూ. 61 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆక్రమణకు గురైన స్థలాన్ని సైతం రెవెన్యూ అధికారుల సహకారంతో గుర్తించి ప్రహరీగోడ నిర్మాణం చేశాం. పూర్తిస్థాయిలో పనులు పూర్తయితే కార్పొరేట్ స్థాయికి కళాశాల అభివృద్ధి చెందుతుంది. అదే స్థాయిలో విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

–పద్మావతి, ప్రిన్సిపల్, వరదయ్యపాళెం జూనియర్ కళాశాల